కథ

# చెకా — చేక

వెంచాశా

గోదావరిగట్టు. గట్టునానుకుని ఊరు. చిన్న పల్లెటూరు. ఊరుచివర చిన్న ఇల్లు. ఇంటిముందు చిన్న తోట. ఇంటికి తాళం. అందమైన ఇల్లు. ఆ ఊరు స్నేహితుణ్ణి చూడ్డానికి వెళ్ళేను. స్నేహితుడు మంచివాడు. అఊళ్లో ఒకరోజు ఉండేటప్పటికి ఏంతోచలేదు. వెళ్తానన్నాను. ఉండమన్నాడు. ఈఊళ్లో విశేషం ఉందన్నాడు. ఏవిటి? అన్నాను. చెకా—చేక అన్నాడు. ఆభాష నాకర్థంకాలేదు. గూట్లోంచి తాళంచెవి తీసి ఇచ్చాడు. తాళంచేతిలో ఏవుంది? అన్నాను. 'ఊరి చివర ఇల్లు' అన్నాడు. 'ఎవరిది?'

ఇంటి యజమాని వీలునామా అది- ఆ ఇల్లు నీవు చదవాలి- ఒక్కడివీవెళ్లు- ఆ ఇల్లు ఏకాంతంగా చదవాలి- మెదడుకు మేత- గట్టునే నడిచి ఓ అరమైలు వెళ్ళి తూర్పువైపు తిరుగు- అక్కడే ఇల్లు- ఎప్పుడూ తాళంవేసి ఉండే ఇల్లు

'నేనక్కడ రెస్టు తీసుకోవచ్చా'
"రెస్ట్ తీసుకోడానికి అది గెస్ట్‌హౌస్‌కాదు.
వెళ్తే నీకే తెలుస్తుంది"
"దయ్యాలుంటాయా"
"దయ్యం అంటే ఏవిటి?"
"ఏమో అది పాడుబడ్డ ఇల్లేమో"

"ప్రతి రెండురోజులకూ ఇల్లు శుభ్రం చేయిస్తాను. ఎవరో మనిషి ఉన్నట్టే ఉంటుంది అక్కడ. వెళ్లు- ఇఖవెళ్లు- వెనక్కు తిరిగిచూడకు—"

మావాడు నన్ను బెదరగొట్టి ఇంటివైపు తరిమాడు— మెదడుకు మేత అన్నాడు.

* *

ఆచిన్ని తోటలో రకరకాల రంగు రంగుల రోజా పువ్వులు నన్ను ఆహ్వానించినయి. తాళం తీశాను. ఇంట్లో ప్రవేశించి- కొంచెం చీకటిగా ఉండటంచేత కిటికీలు తీశాను. కొట్టవచ్చేట్టు అన్నివైపులనుంచి వెలుతురు దూసుకు వచ్చింది. రెండడుగులు ముందుకువేశాను. డ్రాయింగ్ రూము. అందమైన సోఫాలు. కింద పర్షియన్ కార్పెట్.... సోఫాల వెనకాల గోడమీద పెద్దపులి భయంకరంగా- పళ్ళు బయటికివచ్చి నోరుతెరుచుకుని చర్మం గోడనావరించుకుని- పచ్చని మెత్తటి రంగూ- నల్లచారలూ- కాలి గోళ్లూ- షుమారు పన్నెండడుగులు- నావైపే చూస్తున్నది గోడ మీద పులి- పక్కనే వంకెకు 'గన్' వేళ్లాడుతున్నది.

సెంటర్ టేబిల్‌మీద గాజుపలక. పలకమీద పాలరాతి వీనస్ విగ్రహం.... అబ్బ.... ఏం అందం? కార్నర్‌లో చిన్నస్టూల్.... దానిమీద మూడు కోతులు.... మూడు భంగిమల్లో.... ఫ్లవర్‌వేస్‌లో రోజాలు.... సోఫాచేతుల పక్కన యాష్‌ట్రే- వీనస్ విగ్రహాన్ని ఆనుకుని స్పెన్సర్ జావాడాసన్ సిగార్ బాక్స్- మెరుస్తున్న సిగార్ లైటర్- మరోగోడనానుకుని రెండు అద్దాల బీరువాలు. బీరువాల్లో పుస్తకాలు....ఎన్నో పుస్తకాలు.... అవి చూడాలి.... పుస్తకాల పిచ్చోణ్ణి- బీర్వాలో ఒకపక్కగా బుద్ధుని విగ్రహం. విగ్రహం మెళ్లో పూసలదండ. చుట్టూ కొండపల్లి బొమ్మలు- పాముచర్మం. నాగుబాము కళ్ళు- గోడమీద చిన్న మేకు. మేకుకు టెన్నిస్ రాకెట్ వేళ్ళాడుతున్నది ప్రెస్‌లో.

బీరువాలో పుస్తకాలు.... పుస్తకాల వరసలు- గుంగుంపులుగా పుస్తకాలు- ఒక్కొక్క పుస్తకం చేతికి తీసుకుని చూస్తున్నాను.

పైభాగం అంతా దేశచరిత్రలు, హేమా హేమీల జీవితాలు.

ఎరిస్టాటిల్, జూలియస్ సీజర్, చర్చిల్, కెప్టెన్ కుక్, జెంగిస్ ఖాన్, నెపోలియన్, క్లియోపాత్రా, హెలెన్ కెల్లర్, అబ్రహాం లింకన్, గాంధీ.....

రెండో అరలో యుద్ధానికి సంబంధించినవి....

రోమన్ సైన్యం కథ.... పుస్తకంలో రకరకాల బొమ్మలు.... బొమ్మలు యుద్ధంలో పరుగెత్తుతున్నయి- కవచాలు ఇనపటోపీలు- కత్తులూ- బల్లేలూ ...రొమ్ముకు రక్షణఇచ్చే లోహపు కవచాలు- ఏ పుస్తకంచూసినా యుద్ధాలే- చర్చిల్స్ వార్ మెమోయిర్స్- కొన్ని తెల్లకాగితాల పుస్తకాలు- పుస్తకాల్లో రాసుకున్న నోట్సు- గీతలు- బొమ్మలు.... తారీఖులూ....

మూడోఅర.... మతాలు.... ఇంకా ఏవిటో?

375

జూడాయిజమ్, బుద్ధిజమ్, జోరాస్ట్రియానిజమ్, ఇస్లామ్, లామాయిజమ్, షింటో, సిక్కిజమ్, జైనిజమ్, కన్ఫ్యూసియనిజమ్, టావోయిజమ్,....

భారతం, భాగవతం, గీత, బైబిలు, కొరాను- పుస్తకాలలో అక్కడక్కడ రంగుపెన్సిల్‌తో గీతలు- వివేకానంద ఉపన్యాసాలు- ఆయన జీవిత చరిత్ర- అవేచాలా వాల్యూమ్స్ ఉన్నాయి. వివేకానంద పుస్తకాలలో గ్లేజ్‌పేపరుమీద అక్కడక్కడ బొమ్మలు- తలపాగా, కోటూ- తీవిగా చూస్తున్నకళ్ళు- ఒకఫోటోలో క్రింద బ్రహ్మచారి, బ్రహ్మచారి- అని రెండుసార్లు రంగుపెన్సిల్‌తో వ్రాసిఉంది. ఒకదానికి ఆశ్చర్యార్థకం! ఒకదానికి క్వెస్చన్ మార్కు?

వుడ్‌హౌస్....నవలలు.... ఒక నవలలో చివరిపేజీమీద నవ్విస్తాయి! అని నీలంరంగు పెన్సిల్‌తో వ్రాసిఉంది. ఎంతహాయి.... అని మరోచోట....

హౌటుప్లే బ్రిడ్జ్.... How to play goul tennis, -గార్డెనింగ్.... బీరువాలో క్రిందిపక్కన బోలెడు వెండి కప్పులు.... కొన్ని చిన్నవీ. కొన్ని పెద్దవీ.... యుద్ధానికి సంబంధించిన బోలెడు మెడల్సు-

డ్రాయింగ్‌రూమ్‌కూ పక్కనున్నగదికీ మధ్యలో- రంగురంగుల డోర్‌కర్టెన్ గాలికి రెపరెపలాడుతున్నది. పలచగా ఉల్లిపొర కాగితం అల్లే వుంది- అది తోసుకుని లోపలికివెళ్తే ...

గదిమధ్యలో చిన్న డైనింగ్‌టేబిల్... ఒక కుర్చీ- టేబిల్‌కు ఎదురుగా అల్మైరా.... అల్మైరాలో సీసాలూ.... గ్లాసులూ ... విస్కీ సీసాలూ.... బీర్‌సీసాలూ- వైన్ గ్లాసులూ- బీర్ గ్లాసులూ- డిన్నర్ ప్లేట్సూ- కాఫీ సెట్- ఎగ్స్‌పెట్టుకునే చిన్న చిన్న కప్పులూ.... పళ్ళరసం తీసుకుండేది. హాట్‌వాటర్ బ్యాగ్.... ఐస్‌బాక్సు- థర్మామీటరు- ఇంజక్షన్ పెట్టెలూ.... మందు సీసాలూ.... సిరెంజీ పెట్టె.... గోడలమీద అక్కడక్కడా పెద్దపెద్ద పెయింటింగ్స్- లయోనార్డోనావిసీ. పేబ్లో పికాసో, రాయ్ చౌదరి, రవివర్మ.... ఆ పెయింటింగ్స్.... కళ్ళుచెదిరేట్టుగా ఉన్నాయి....

అది చిన్న డైనింగ్ హాల్- దాంట్లోంచి మరో చిన్న గది- బెడ్ రూమ్- ఒక బెడ్- బెడ్‌ని ఆనుకుని చిన్న స్టూల్- దానిమీద టేబిల్ లైట్- కొంచెందూరంలో అల్మైరా-

అల్మైరాలో మిలిటరీ యునిఫారమ్ హాంగర్‌కు వేళ్లాడుతోంది. కోటుమీద 'కల్నెల్' ఇన్‌సిగ్నియా ఉంది. ఒకపక్కగా మిలిటరీ బూట్స్-

376

ఆల్మైరాకు ఒకపక్కగా రైటింగ్ టేబిల్. ఒకకుర్చీ- టేబిల్ మీద గాజుపలక. గాజుపలకకింద ఎడమవైపు ఒక కాగితం. కుడివైపు ఒక కాగితం. ఆరెండు కాగితాల మీద ఏదో గిలికిపారేసి ఉంది. ఒకటి తెలుగులో ఒకటి ఇంగ్లీషులో.

ఒక కాగితంమీద– No greatman lives invain.

The History of the world is but the biography of Great Men" అని ఉన్నది మరో కాగితంమీద.

"దుఃఖేష్వనుద్విగ్నమనుస్సు ఖేషు విగతస్పృహః
వీత రాగ భయ క్రోధఃస్థిత ధీర్మునిరుచ్యతే"

అని ఉన్నది.– నీలంరంగు పెన్సిల్ రాత–

టేబిల్ మీద చిన్న ఫ్రేములో అందమైన అమ్మాయి ఫోటో–ఫోటో వెనకాల–

"నన్ను మరచిపోండి– మరో జన్మ అంటూ ఉంటే మళ్ళీ కలుసుకుందాం"– అనివుంది. ఆ అమ్మాయి నాజూకుగా– సన్నగా– పసిడి బొమ్మలా ఫోటోలోంచి నవ్వుతోంది.

బెడ్ కు అటువైపుగా వెళ్లేను. షాక్ తగిలింది. తొడ సగంనుండి కిందివరకూ పాదాలతోసహా చెక్క–కాలు. పక్కన చేతి–కర్ర!! గిరుక్కున వెనక్కు తిరిగేను. నా భుజంమీద చేయివేసి నవ్వినట్టే ఉంది ఆప్యాయంగా–

తాళంవేసి గట్టువెంబడి బరువుగా నడుస్తూ.... ఇంటికి చేరుకుని తాళంచెవి మావాడికిచ్చేను.

"ఇంత సేపు ఏం చూస్తున్నావ్– ఏం చేస్తున్నావ్– ఆఇంట్లో" అన్నాడు మావాడు,

నాకు నోరు పెకల్లేదు!!

ఆ ఇంటోని ప్రతి వస్తువు ఒకకథ చెప్తోందిమరి!!!